ప్రజాశక్తి
బుధవారం 3 మే 2023
5
పార్వతీపురం మన్యం

జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రేమకుమార్



ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా విద్యాశాఖ అధికారిగా (ఎఫ్‌ఎసి) నిమ్మక ప్రేమకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్‌ఎసి డిఇఒతో పాటు ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన అనకాపల్లి జిల్లా యలమంచిలి డిప్యూటీ డిఇఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఈయన స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం. ప్రేమ కుమార్ ఎఫ్‌ఎసిపై డిఇఒగా వస్తున్న సందర్భంగా గుమ్మలక్ష్మీపురం ప్రజలు అభినందించారు. ప్రస్తుతం ఇక్కడ డిప్యూటీ డిఇఒగా పనిచేస్తున్న బ్రహ్మాజీ పాడేరుకు బదిలీ అయ్యారు.

ప్రజల మనిషి శ్రీరామ్మూర్తి

నేడు ద్వితీయ వర్ధంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతానగరం మండలం రెడ్డివానివలసకు చెందిన శ్రీరామ్మూర్తి తొలినుంచీ జనంలో కలిసిపోయే తత్వం. బహుశా అందుకేనేమో యువతరంలో ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా యువజన సంఘాలు ఏర్పాటు చేయడం మొదలెట్టారు. అనంతరం రెండేళ్లకే ఎర్రజెండాకు ఆకర్షితుడైన ఆయన చిన్న వయసులోనే డివైఎఫ్‌ఐ సంఘంలో అడుగుపెట్టి వర్గపోరులో తుదిశ్వాస విడిచే వరకు పీడిత ప్రజలపక్షాన నిలిచారు. అనతికాలంలోనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అవగతం చేసుకుని సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా చేరి ప్రజాసేవకు పునరంకితమయ్యారు. 2021 మే 3న కన్నుమూసేంత వరకు మరో ఆలోచనే లేకుండా జీవితాన్ని పార్టీకి, ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారు. బోడికొండ, బడిదేవరకొండ, సిఖపరువు, తామరకొండ గ్రానైట్ తవ్వకాలు, రావివలస మెట్ట అక్రమ తవ్వకాల్లో వర్గ శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. భూ ఆక్రమణలు, రావివలస కో- ఆపరేటివ్ సొసైటీలో బినామీ అప్పులు, గొట్టివలస భూములు ఇలా అదీ ఇదీ అని లేదు. ఎక్కడ ప్రజల సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షమయ్యేవారు.

గిరిజనోద్యమ పునర్నిర్మాణంలో శ్రీరామమూర్తి పాత్ర కీలకం. గిరిజనుల సమస్యలు, అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరలు, ఫారెస్ట్ అధికారుల దాడుల నుండి గిరిజనుల రక్షణ, మావోయిస్టులకు సానుకూలంగా ఉన్నారని గిరిజనులపై పోలీసుల దాడుల నుండి రక్షణకు చేసిన పోరాటాలు, ఉద్యమాలకు సారథ్యం వహించారు. సవర విద్యావాలంటీర్ల సమస్య మొదలుకుని గిరిజన ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, అటవీ భూమికి పట్టాలు తదితరాలపై అలుపెరుగని పోరాటం చేశారు. అందుకే శ్రీరామ్మూర్తి మరణాన్ని మణ్యం జీర్ణించుకోలేకపోయింది. తోటపల్లి బ్యారేజీ నిర్వాసితుల తరపున పోరాడి నిర్వాసితుల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆయనది ముఖ్యమైన పాత్ర. మెరుగైన నష్టపరిహారం, పునరావాసం సాధించుకోవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంతో ఉంది. చెరకు రైతుల ఉద్యమంలో యాజమాన్యం వెన్నులో వనుకు పెట్టించి రైతుల బకాయిలు ఇప్పించిన ఘనత శ్రీరామ్మూర్తిదే. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని ఆయన నాయకత్వం వహిస్తున్న ప్రాంతంలో ముందువరుసలో ఉండి నడిపించారు. ప్రతి పరిచయాన్నీ పార్టీ నిర్మాణం కోసం ఉపయోగించి బలోపేతం చేశారు. అంతిమ క్షణాల వరకు వ్యక్తిగత పనులు పక్కనబెట్టి నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ కోసమే పనిచేశారు.

కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి... ఈ పేరు ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా పార్వతీపురం రెవెన్యూ డివిజన్‌లో పరిచయం అక్కర్లేనిది. నిత్యం చెరగని చిరునవ్వు. పేదలకు ఆప్యాయత, అనురాగాలు పంచడం ఆయన జీవన శైలి. ప్రజాఉద్యమాలతో పెనవేసుకుపోయిన నాయకుడాయన. గిరిజనోద్యమాల ఘనకీర్తి. ఆదివాసి హక్కుల రణనేత. గిరిజనుల పక్షాన నిలిచే జననేత. అటవీ హక్కుల సాధనలో నిరంతర శ్రామికుడు. తోటపల్లి నిర్వాసితుల ఉద్యమ రణధీరుడు. అనుక్షణం ప్రజల పక్షమై నిలిచిన నాయకుడు. రైతులు, వ్యవసాయ కార్మికుల పాలిట బాంధవుడు. ప్రజల మనసులు తెలుసుకున్న నిరంతర శ్రామికుడు. ఎన్నో సంఘాలకు సారథ్యం వహించారు. సాధారణ కార్యకర్త నుంచి సిపిఎం పార్వతీపురం ప్రాంత కార్యదర్శిగా ఎదిగారు. ఎదిగిన కొద్దీ ఒదుగుతునే నిర్మాణ దక్షతలో సాటిలేని నాయకుడనిపించుకున్నారు. లాఠీలు, తూటాలకు ఏనాడూ వెరవలేదు. ఉద్యమ ప్రస్థానంలో అక్రమకేసులు, అణిచివేత చర్యలు, నిర్బంధాలు, జైలు జీవితానికి వెనుకాడ లేదు. ఇవంటి సందర్భాల్లో గోడకు కొట్టిన బంతిలా ప్రజాపోరాటాలను మరింతగా బలోపేతం చేస్తూ ఉద్యోమాలను ముందుకు నడపించడంలో రాటుదేరారు. ఎందరికో ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన శ్రీరామ్మూర్తి సుమారు 20రోజులపాటు కరోనా మహమ్మారితో పోరాడిన ఆయన 2021 మే 3న తుదిశ్వాస విడిచారు. బుధవారం శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా పార్వతీపురంలో సిపిఎం ఆధ్వర్యాన సభ నిర్వహించనున్నారు.

సిపిఎం జెండాలోనే ఆర్‌ఎస్‌ఎంను చూసుకుంటా

కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి దూరమై రెండేళ్లయినా సిపిఎం జెండా లోనే ఆయన జ్ఞాపకాలను ప్రతిక్షణం గుర్తుకొస్తాయి. ఆర్‌ఎస్‌ఎం దూరమైన నుంచి ఇంట్లో నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. ఆయన భౌతికంగా కనబడని మా జీవితంలో సిపిఎం జెండాలో నాటి పార్టీ కార్యక్రమాల గుర్తులతో మాతో ఆర్‌ఎస్‌ఎం ఉన్నారన్న ధైర్యంతోనే జీవిస్తున్నాం. ఆర్‌ఎస్‌ఎంను ఉద్యమాలలో మార్గదర్శిగా తీసుకొని చొరవగా పార్టీ , ప్రజా సంఘాల కార్యక్రమాలు నిర్వహించగలిగేదాన్ని. ఆయన దూరమైన తర్వాత అంధకారమయంగా కనిపిస్తున్నప్పటికీ ఆయన ఆశయాలు, ఉద్యమ స్మృతులు నన్ను పార్టీ, ప్రజా సంఘాల, కార్యక్రమాల వైపు నడిపిస్తున్నాయి. ఉద్యమ స్ఫూర్తితో కుటుంబాన్ని ఉన్నతంగా నడిపించడంలో ఆయన దగ్గర నేర్చుకున్న పాఠాలు నేడు నా కుటుంబాన్ని ముందుకు సాగేలా ప్రయత్నం చేయగలుగుతున్నాను. ఆయనకున్న ధైర్యం, నిరాడంబరత, సమయస్ఫూర్తి వంటి ప్రజా జీవితానికి కావలసిన ఎన్నో విషయాలను ఆయన సతీమణిగా నేర్చుకోగలిగాను. ఇప్పుడు అదే ధైర్యాన్ని నింపుకుంటూ ఉద్యమాలలో ముందడుగు వేయ గలుగుతున్నాను. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటులో కూడా కీలక పాత్ర పోషించిన ఆయన మన్యం జిల్లా వాసులలో అమరజీవిగా నిలుస్తారు. ఆయన ఆశయాలను కొనసాగించడంతోనే ఆయనకు నిజమైన నివాళులు.

శ్రీరామ్మూర్తి సతీమణి శ్రీదేవి

నేడు వర్ధంతి సభ

రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సభ బుధవారం బెలగాం సెంటర్లో గల గిరిజన సామాజిక భవనంలో జరుగుతుంది. ఈ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. సభకు సిపిఎం రాష్ట్రనాయకులు హాజరవుతారని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, జెసి, డిఆర్‌ఒ

9 నుంచి జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈనెల 9న ప్రారంభమవుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన చెప్పారు. ముఖ్య మంత్రి కార్యాలయం పరిధిలో 1902 నెంబరు కాల్‌సెంటర్ పనిచేస్తుందన్నారు. ముఖ్య మంత్రి కార్యాలయం నుండి ఆడిట్ టీమ్‌లను ఏర్పాటు చేశారని, ప్రతి ఆర్జీని కాల్‌సెంటర్ నుంచి అడుగుతారని ఆయన తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల, పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిఎం కార్యాలయం నుండి జిల్లాల వారీగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. జిల్లాకు ప్రత్యేక అధికారిగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను నియమించారని, మే 10న జిల్లాలో పర్యటిస్తారని అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన విజ్ఞాపనలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, అందుకు అందరూ బాధ్యత వహించాలని ఆయన ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో సమస్యల పరిష్కార అథారిటీ (గ్రీవెన్స్ రిడ్రస్సల్ అథారిటీ) ప్రతి కార్యాలయంలో ఉండాలన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పక్కాగా అమలు జరగాలని స్పష్టం చేశారు. ప్రతి గురువారం ప్రత్యేక పర్యవేక్షణ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పత్రికల్లో ప్రచురితమైన ప్రతికూల వార్తలను సైతం పక్కాగా పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల వ్యవధిలో పరిష్కారానికి అవసరమైన చర్యలు సంబంధిత అధికారి చేపట్టాలని, లాగిన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఆర్జీలు నిర్దేశిత సమయంలో పరిష్కారం కావాలన్నారు. ఆర్జీదారునితో మాట్లాడి లేదా కలుసుకుని పరిష్కరించాలన్నారు. శత శాతం పరిష్కారం ఉండాలని, సంతృప్త స్థాయి నూరు శాతం ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఆర్జీపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేస్తానని జిల్లా కలెక్టర్ చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హత ఉంటే వారికి మంజూరు చేస్తామని ఆయన అన్నారు. భూ సంబంధిత కేసులో పరిష్కారానికి నిబంధనల మేరకు అవకాశం ఉందని, తహశీల్దార్, పోలీసు ఎస్‌ఐ కలిసి పరిష్కరించవచ్చని అన్నారు.

ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్

జిల్లా స్థాయిలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు. డిఆర్‌ఒ, ఎల్విన్‌పేట ఎస్‌డిసి, జెడ్‌పి సిఇఒ, డిఎంహెచ్‌ఒ, పోలీస్ కార్యాలయం నుండి ఒక ఇన్స్పెక్టర్ తదితరులు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌లో ఆడిట్ విభాగంలో ఉంటారని, వారి నుంచి ఫోన్ వస్తే వెంటనే స్పందించాలని ఆయన ఆదేశించారు. జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ ఒక ఆర్జీదారు పలుమార్లు ఒక సమస్య పరిష్కారానికి రాకూడదని, అందుకు పక్కాగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ వాణిజ్య, రవాణా అధికారి ఎల్.అశోక్ కుమార్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు వెనక్కు తీసుకోవడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి కలెక్టరేట్

ఈ ఏడాది జనవరిలో ప్రమోషన్ల కోసం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు అన్నారు. కోర్టులో తెలుగు, హిందీ అసిస్టెంట్లకు సంబంధించి కేసు నడుస్తున్నందున తాత్కాలిక ప్రాతిపదికన రూ.2500తో (నెలకు) ప్రమోషన్లు జనవరిలో ఇచ్చారన్నారు. ప్రకటించిన రూ.2500 ఇప్పటికీ అందలేదు సరికదా, ప్రమోషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు ప్రకటించారన్నారు. ఈ విషయమై విద్యాశాఖ పూర్తి వివరణ ఇవ్వాలని, ఈ ఉత్తర్వులు ప్రకారం ప్రమోషన్లు రద్దు అయినట్లా, కాదా తేల్చాలని డిమాండ్ చేశారు. ఒక వేళ రద్దయితే ఈ నాలుగు నెలల అలవెన్సు ఇస్తారా? లేదా? తేల్చాలన్నారు. రూ.2,500 ప్రమోషన్ల టీచర్ల కోసం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ నాలుగు నెలల అలవెన్సులు ఇవ్వాలని, ప్రమోషన్లతో పోస్టులో కొనసాగేలా స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చాలని, లేనిచో యుటిఎఫ్ పోరాడుతుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి స్టేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యులు ప్రసాదరావు

'జట్టు' సేవలు మరింత చేరువ కావాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి /గుమ్మలక్ష్మీపురం

జట్టు ట్రస్ట్ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కమిటీ మెంబర్ మరియు జట్టు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో 94వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలోని రైతులు వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవడానికి, ఆర్థిక అభివృద్ధి చెందడానికి జట్టు సంస్థ సూచనలు, సలహాలు ఎల్లవేళలా అందిస్తూ అండగా ఉండాలన్నారు. మారుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఆధునిక యంత్ర పరికరాలు ఉపయోగించి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండించేలా రైతులు తమకున్న మొత్తం విస్తీర్ణంలో ఏడాది పొడవునా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఆచరించేలా చేయాలని సూచించారు. నేటికీ జట్టు ట్రస్టు 25 ఏళ్లు పూర్తి చేసుకుని రజితోత్సవం చేసుకోవడం చాలా అభినందించదగ్గ విషయమన్నారు. డిజిటల్ గ్రీన్ స్టేట్ ఫైనాన్స్ మేనేజర్ సుధా నారాయణన్ మాట్లాడుతూ జట్టు సంస్థ సహకారంతో తమ సంస్థ చేపడుతున్న చరవాణి కార్యక్రమాలు, వాట్సప్ మెసేజ్‌లు, పికోల ద్వారా చిత్రాలు వేయడం, ప్రకృతి వ్యవసాయం ద్వారా గిరిజన ప్రాంతాల్లో పండ్ల తోటలు, మిగతా పంటల గురించి, రైతులకు పంట స్థితులను బట్టి చేపట్టే యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేయిస్తామన్నారు. కమిటీ సభ్యునిగా ఎంపికైన సందర్భంగా మెమొంటో, శాలువతో సత్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఎం.సుశీల, పి.రవికుమార్, టి.రత్నాకర్, ఎన్.సింహాద్రి, డిజిటల్ గ్రీన్ ప్రోగ్రాం మేనేజర్ వి.కమలాకర్, జట్టు ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని పక్కనపెట్టి.. ఆకాశ హార్మ్యాలు

- ఎర్రబస్సు వెళ్లని గ్రామాలెన్నో...
- ఎండమావిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- గిరిజన వర్సిటీకి భూ కేటాయింపులో తాత్సారం
- సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యం
- నేడు సిఎం జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన

జిల్లా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రహదారి, రవాణా సదుపాయాలను పక్కనబెట్టిన ప్రభుత్వం ధనవంతులు, కార్పొరేట్ శక్తులకు దోహదపడే ఆకాశహార్మ్యాలకు తహతహలాడుతోంది. ఓవైపు ఆర్‌టిసి బస్సు కూడా వెళ్లని గ్రామాలు, రహదారులకు నోచుకోని గిరిజన గ్రామాలు అనేకం ఉన్నా వాటిని పట్టించుకోని ప్రభుత్వం అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత ప్రాధాన్యతనివ్వడమే ఇందుకు తార్కాణంగా చెప్పకోవచ్చు. అలాగని ఎయిర్‌పోర్టు ఏర్పాటు తప్ప కాదు. దానికి ఇచ్చిన ప్రాధాన్యత జిల్లా జిడిపి, తలసరి ఆదాయం పెంపునకు ఎందుకు ఇవ్వడం లేదన్నది ఇక్కడ ప్రశ్న. భోగాపురంలో తలపెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల ప్రారంభానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం వస్తున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధి, వనరులు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై కీలక చర్చసాగుతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా అత్యంత వెనుకబడి ఉంది. ఉన్నపాటి కొద్దిపాటి జ్యూట్ మిల్లులు ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్లలో దాదాపు మూతపడ్డాయి. కొత్తవలస ప్రాంతంతో పెంకుల మిల్లులదీ అదే పరిస్థితి. చిన్న చితక ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో కొట్టిమిట్టాడు తున్నాయి. ఒకప్పుడు ఉత్తరాంధ్రకే తలమానికంగా వున్న గిరివిడి ఫేకర్ కూడా ఉత్పత్తి తగ్గించడంతో వేలాది మంది ఉద్యోగ, ఉపాధి కోల్పోయారు. పర్యాటకాభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోలేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 80శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. సారవంతమైన భూములు ఉన్నాయి. అత్యధిక వర్షపాతం నమోదవు తున్నప్పటికీ సాగునీటి వనరుల అభివృద్ధిపై పాలకులు పెద్దగా శ్రద్ధ చూపక పోవడంతో వ్యవసాయ రంగంలోనూ తగినంతగా పురోగతి లేదు. ఫలితంగా ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఉపాధి అవకాశాలు లేక జిల్లా నుంచి వేలాది మంది వలస పోతున్నారు. ఇటువంటి తరుణంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు గానీ, జిల్లాలో తలపెట్టిన గిరిజన కేంద్రీయ విద్యాలయం భవన సముదాయ నిర్మాణానికిగానీ, పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకుగానీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

58,757ఎకరాలకు అందని తోటపల్లి నీరు

64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే 2019-20 బడ్జెట్‌లో రూ.156 కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57 కోట్ల కేటాయించగా రూ.37.27 కోట్లు చెల్లించింది. 2021-22లో 189.70 కోట్లకు గాను రూ.135 కోట్లే ఇచ్చింది. 2022-23లో 126.61 కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. వీటన్నింటికీ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.80.84 కోట్లు మాత్రమే కేటాయించారు. పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. అలాగే ఒడిశా రాష్ట్రంతో సంప్రదింపులు జరిపి జంఝావతి పూర్తిచేసేందుకు రాజకీయ చిత్తశుద్ధి కనబర్చడం లేదు.

గిరిజన విద్యపై నిర్లక్ష్యం ఎందుకు?

రూ.420కోట్ల యుజిసి నిధులతో తలపెట్టిన గిరిజన యూనివర్శిటీ భవన సముదాయం నిర్మాణానికి స్థలం కేటాయింపులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం రెల్లిలో భూమిని కేటాయించిన విషయం విధితమే. వైసిపి అధికారంలోకి వచ్చాక స్థల మార్పుపేరుతో రెండేళ్ల కాలయాపన చేసింది. ఏడాదిన్నర క్రితం మెంటాడ మండలంలో 561ఎకరాల భూమి కేటాయించారు. భూ సేకరణ ఇప్పటికీ పూర్తిచేయలేదు. దీంతో, తరగతులు, హాస్టల్ నిర్వహణకు వసతి సమస్య ఉండడం వల్ల వచ్చిన అడ్మిషన్లు చేజా రిపోతున్నాయి. భవనాలు, గదులు సరిపోవడం లేదు. లేబొరేటరీ, లైబ్రరీ, ఆటస్థలాలు, జిమ్, పరిశోధనకు అవసరమైన ఇతర సదుపాయాలు లేకపోవడం వల్ల సీతం, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, మాన్సాస్ పరిధిలోని ఎంఆర్ అటానమస్, ఎంఆర్ డిగ్రీ కాలేజీలపై ఆధారపడుతున్నారు.

9 నుంచి పెన్షనర్ల భవనంలో ఇకెవైసి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక రిటైర్డ్ పెన్షనర్ల భవనంలో ఈనెల 9న ఇకెవైసి చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పింఛనర్లు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ పెన్షనర్స్ కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇకెవైసి చేయించుకొనే వారు ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్, సిఎఫ్ఎంఎస్ నెంబర్/పిపిఒ నెంబర్ తీసురావాలని సూచించారు.

గుమ్మలక్ష్మీపురం : కురుపాం సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలో ఉన్న కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని పింఛన్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని గుమ్మలక్ష్మీపురం పెన్షనర్ల సంఘం నాయకులు హరిప్రసాద్, రథో కోరారు. ఎవరైనా ఇప్పటి వరకు ఇకెవైసిని చేయించుకోకపోతే ఈనెల 3,4,5.తేదీల్లో పెన్షనర్ల సౌకర్యం కోసం కురుపాం ట్రెజరర్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కురుపాం మండలానికి సంబంధించిన పెన్షనర్లు కురుపాం ఉపఖజాన కార్యాలయం వద్ద, జియ్యమ్మవలస మండలానికి సంబంధించిన పెన్షనర్స్ ఎంపిడిఒ కార్యాలయం వద్ద, గుమ్మలక్ష్మీ పురం మండలానికి సంబంధించిన పెన్షనర్ల వర్తక సంఘం భవనం వద్దకు ఎస్‌టిఒ కురుపాం కార్యాలయ సిబ్బంది వచ్చి ఇకెవైసి చేస్తారని తెలిపారు. బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ ఫోన్, పిపిఒ నెంబరు తీసుకెళ్లి చేయించుకోవాలని కోరారు.

సాలూరు: ఈనెల 6లోగా పింఛనుదారులంతా వారి సిఎంఎఫ్ఎస్ ఐడితో ఆధార్ నెంబర్ ఈకెవైసి లింక్ చేసుకోవాలని ఫించనుదారుల సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షులు బాలబోలు ధనుంజయరావు ఒక ప్రకటనలో కోరారు. పింఛనుదారులు నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయానికి గానీ, స్మార్ట్ ఫోన్ లో హెర్బ్ యాప్ ద్వారా గానీ ఇకెవైసి లింక్ చేసుకోవాలని సూచించారు. సిఎంఎఫ్ఎస్ ఐడి, ఆధార్ కార్డుతో లింక్ చేసి వున్న ఫోన్ నెంబర్, పిపిఒ నెంబర్, బ్యాంక్ ఖాతా పుస్తకం తీసుకుని రావాలని ధనుంజయరావు ఆ ప్రకటనలో తెలిపారు.

నాడు-నేడు పనులు పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నాడు-నేడులో రూ. 67లక్షలతో చేపడుతున్న స్థానిక జూనియర్ కళాశాల అభివృద్ధి పనులను పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ మంగళవారం పరిశీలించారు. కళాశాల ఆవరణంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, నీటి సరఫరా పనులను పరిశీలించారు. 28 ఫ్యాన్లు కొనుగోలుకు ఇండెంట్ పంపించామని, కొత్తగా విద్యుత్ వైరింగ్, ప్రధాన గేటు ఏర్పాటుకు పనులు చేపడుతున్నట్లు ఇన్చార్జి ప్రిన్సిపల్ కె.సుధాకర్ సబ్‌కలెక్టర్‌కు వివరించారు. నాడు- నేడు పనులతో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులు జరగాలని సూచించారు. అనంతరం చింతలగూడ, లక్కగూడ గ్రామ సమీపంలో ఉన్న భూముల రీసర్వే పరిశీలించారు. రీ సర్వేకు సంబంధించి సరిహద్దు రాళ్లు వేయించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, సిబ్బందితో భూముల రీసర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా భూముల రీసర్వే జరగాలని, ఎప్పటికప్పుడు రిపోర్టులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాములమ్మ ఉన్నారు.

రీసర్వే పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

వైద్యసేవలపై అవగాహన అవసరం

డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పుట్టిన వెంటనే పిల్లలకు ఇంటి వద్ద ఇచ్చే సేవల గురించి అందరికీ అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. పెద బొండపల్లి, బందలుప్పి, డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన ఆశా డే కార్యక్రమాన్ని సందర్శించారు. గర్భిణులకు ఉపయోగపడే కిల్కరీ యాప్ గురించి ఆశాలకు అవగాహన ఏ మేరకు ఉందో సమీక్షించారు. ప్రతి ఆశా, సి.హెచ్.డబ్ల్యు దగ్గర కిల్కారి నంబర్ ఉండాలని, ఎవరైనా గర్భిణీలు ఫోన్ ఎత్తకపోతే తిరిగి వారి చేత ఫోన్ చేయించి దాని ద్వారా వచ్చే ఆరోగ్య సూచనలు జాగ్రత్తగా విని పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండ ప్రాంతంలో ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రసవం జరిగే సమయానికి ఆశా కార్యకర్త హాస్పిటల్‌కు తీసుకురావాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, ముఖ్యంగా రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న అందర్నీ గుర్తించి ప్రతినెలా ఫ్యామిలీ డాక్టర్‌కు చూపించి మందులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో ఇసిఆర్‌పి నిధులతో నిర్మిస్తున్న 6 పడకల వార్డ్ పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జలమయమైన పార్వతీపురం ప్రధాన రహదారి

పార్వతీపురంలో భారీ వర్షం

పార్వతీపురం రూరల్ : పట్టణంతో పాటు మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షానికి పట్టణ ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రహదారులు పూర్తిగా జలమయం కావడంతో అటు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రహదారి ఫుట్పాత్ ఆక్రమణలు తొలగించాలని, వర్షపు నీరు పోయేలా చూడాలని కోరుతున్నారు. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, బందులుప్పి, అడ్డాపుశీల, బాలగొడవ గ్రామాల్లో కూడా వర్షం కురవడంతో రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. నూలు చేలు కోతకు రావడంతో ఈ వర్షం పంట నష్టం కొంతమేరకు కలుగుతుందని రైతులు తెలిపారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి దీనమయ్య

క్రికెట్ పోటీలు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురంలో వాలంటీర్గా పనిచేసిన వరుణ్కుమార్ వర్ధంతి సందర్భంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ క్రీడలను ఎంపిపి కె.దీనమయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వాలంటీర్గా విధులు నిర్వహిస్తూ చిన్న వయసులోనే వరుణ్ కుమార్ మృతి చెందడం బాధాకరమన్నారు. అతని జ్ఞాపకార్థంగా కేదారిపురంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలు క్రీడాకారుల్లో ప్రతిభ వెలికి తీయడానికి, యువతలో స్నేహభావం పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, సర్పంచి తులసమ్మ, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

ఘనంగా వేపారమ్మ వేడుకలు

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో గల వేపారమ్మ గ్రామదేవతకు మంగళవారం గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కలశాలతో ఊరేగింపుగా వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని జోగింపేట, పాపమ్మవలసలో మంగళవారం ఉపాధి పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు ప్రభుత్వం నిర్ణయించిన సమయం, కొలతలు బట్టి పనిచేయాలన్నారు. పనిచేస్తే ప్రభుత్వ నిర్మించిన ధర వస్తుందన్నారు. అలాగే పని ప్రదేశాల్లో ఉండే మౌలిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు

8 నుంచి పెదభోగిలిలో గ్రామదేవత పండగ

సీతానగరం : మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో గల సీతానగరం, బుడ్డిపేట, అప్పయ్యపేట, పెద్దబౌలి గ్రామాల్లో ఈనెల 8,9,10 తేదీల్లో గ్రామ దేవత పండగ జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు కె.అరవింద్ కుమార్ నాయుడు, శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు తెలిపారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

డిప్లొమా విద్యార్థులకు నియామక పత్రాలు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్లో నియామకాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలను సర్పంచి బొత్తాడ గౌరీ శంకరరావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా గిరిజన విద్యార్థులు, వెనుకబడిన వారు సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా పారిశుధ్య పనులు

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో పారిశుధ్య పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్ యంత్రాలతో కాలువలో చెత్తా, చెదారాలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో గల అన్ని వీధుల్లో, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా చేపట్టడమే లక్ష్యంగా చేస్తున్నామని తెలిపారు. ఇంకెక్కడైనా పారిశుధ్య లోపం ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే తీయిస్తామని అన్నారు.

4న స్మార్ట్ టౌన్ షిప్ ప్లాట్ల అమ్మకాలు

సాలూరు : పట్టణంలోని జాతీయ రహదారిపై బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్లో ప్లాట్ల అమ్మకాలను ఈనెల 4న ప్రారంభిస్తారు. పట్టణంలోని శ్రీ సీతారామ కల్యాణమండపంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆన్లైన్ ద్వారా ప్లాట్ల అమ్మకాల వెబ్ సైట్ను ప్రారంభిస్తారు. గురువారం నుంచి ప్లాట్లు కొనుగోలుపై ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని బుడా అధికారులు చెబుతున్నారు. బుడా చైర్పర్సన్ ఇంటి పార్వతి, వైస్ చైర్మన్ కె.మయూర్అశోక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు.

నిడగల్లులో శివాలయం పునర్నిర్మాణం

సీతానగరం : మండలంలోని నిడగల్లులో అతి పురాతన శివాలయాన్ని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులు వేగవంతంగా చేస్తున్నారు. ఎమ్మెల్యే జోగారావు సహకారంతో దేవాదాయశాఖ కూడా ఈ శివాలయ నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరు చేయగా, దానిలో రూ.13లక్షలు విడుదల చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దీంతో పాటు గ్రామస్తులు కూడా ఆలయ పునర్నిర్మాణానికి పెద్దఎత్తున సహకారాన్ని అందించారు. ఆలయాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామపెద్దలు మరడాన శివన్నాయుడు, ప్రసాద్ పాత్రుడు, గుజ్జు శ్రీనివాసరావు, తోడబంటి సూర్యనారాయణ తదితరులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

పాలకొండ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారని వెంకంపేట ఎంపియుపి పాఠశాల హెచ్ఎం జి.పారసంకరనాయుడు తెలిపారు. వీవర్స్ కాలనీ, వీధుల్లో ఉపాధ్యాయుల బృందం మంగళవారం పర్యటించి బడిబయట ఉన్న వారితో పాటు ఆరేళ్లు నిండిన వారిని తమ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు. విద్యా కానుక కింద పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూలు అందిస్తున్నారని తెలిపారు. పౌష్టికాహారమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజన పథకం కింద పెడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏడుగురు విద్యార్థులకు కొత్త అడ్మిషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

140 మందితో పోలీస్ బందోబస్తు

వీరఘట్టం : ఈనెల 7,8,9 తేదీల్లో వీరఘట్టంలో జరగనున్న పైడితల్లి అమ్మవారి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా 140మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకొండ సిఐ కె.మురళీధర్ ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి అమ్మవారి గ్రామ దేవత ఆవరణలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. బోయిడు ఇంటి వద్ద నుంచి పాల జంగిడితో పాటు ఘటాలు ఏవీ తేదీల్లో ఊరేగింపు వివరాలను తెలియజేయాలని కమిటీ సభ్యులకు ఆదేశించారు. ఈతోపాటు స్థానిక ఎస్ఐ పి.కిషోర్ వర్మ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

5న రెండు ఆటోలు వేలం

సీతంపేట: స్థానిక పోలీస్ స్టేషన్లో ఈనెల5న 2 ఆటోలు వేలం వేస్తున్నట్లు ఎస్ఐ ఎ.నీలకంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు.

జూన్12లోగా నాడు-నేడు పనులు పూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మంజూరైన నాడు-నేడు పనులను జూన్ 12లోగా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి విద్యా శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో నాడు నేడు పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం లోగా నాడు-నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు మరుగుదొడ్లు లేని పాఠశాలల్లో తొలి ప్రాధాన్యతగా గుర్తించి తప్పనిసరిగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా పనుల పురోగతి చూపాలన్నారు. పాఠశాలల గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలను ప్రాధాన్యాంశాలుగా తీసుకొని సౌకర్యాలు ఏర్పాటుకు ఎంఇఒ, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మెటీరియల్ అందలేదన్న మాట రానివ్వొద్దన్నారు. జూన్ 12 నాటికి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఫర్నీచర్, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. జూనియర్ కళాశాల సిపిఎ మెటీరియల్ కింద ఆర్ఒ ప్లాంట్ వచ్చిన వెంటనే జాప్యం లేకుండా అమర్చాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఇన్ఛార్జి డిఇఒ పి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాకు మంజూరైన రహదారులు, వంతెన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారులతో పిఎంజిఎస్ వై, ఆర్సిపిఎల్ డబ్ల్యుఇఎ రహదారి నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన రహదారి పనుల పురోగతి, పెండింగ్లో ఉన్న పనులకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలంలో వంతెన నిర్మాణ పనులు పూర్తికి అనుకూలమైనందున వర్షా కాలంలోగా పనులు పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్సిపిఎల్డబ్ల్యు రహదారులను బిటి రోడ్లుగా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిధుల కొరత లేదని, ఇప్పటికే పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లిస్తున్నట్టు తెలిపారు. పనులు పూర్తికాగానే గుత్తేదారులకు బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ అనుమతులు కొరకు జిల్లా స్థాయి కమిటీకి ప్రతిపాదనలు అందజేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీని ఆదేశించారు. రహదారుల నిర్మాణాల్లో నాణ్యతలో రాజీపడకుండా పూర్తి చేయడంతో పాటు, వాటి నిర్వహణ కోసం సక్రమంగా బాధ్యత వహించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో పాలకొండ ఇఇ ఎస్.రాధారాణి, సాలూరు, కురుపాం, పాలకొండ, డిఇఇలు డబ్ల్యువిఎస్ఎస్ శర్మ, జి.శ్రీనివాసరావు, ఎన్.వెంకట్రావు, ఎక్స్ ఆర్ కె కన్స్ట్రక్షన్ ప్రతినిధి వెంకటరెడ్డి, శ్రీనివాస ఇన్ఫ్రా ప్రతినిధి ఎ.దినేష్, విఎస్ఆర్ కన్స్ట్రక్షన్ జి.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలు పూర్తి కావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రాధాన్యతా భవనాల పనులు పూర్తి కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మండల అధికారులతో కలెక్టర్ మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో గతవారం మంచి పని జరిగిందన్నారు. జరిగిన పనులకు గత వారం రూ.12.37 కోట్లు చెల్లింపు జరిగిందని, అందులో ప్రాధాన్యత పనులకు రూ.7.87 కోట్లు, ఇతర పనులకు రూ.4.50 కోట్లు ఉన్నాయని చెప్పారు. ఏప్రిల్ 28 నాటికి అప్లోడ్ చేసిన బిల్లులకు మే 8 నాటికి చెల్లింపు జరుగుతాయని పేర్కొన్నారు. చెల్లింపుల్లో జాప్యం ఉండదన్నారు. ప్రాధాన్యత భవనాల పనులు, గడప గడపకు మన ప్రభుత్వం పనులు ప్రగతిలోకి రావాలని ఆయన స్పష్టం చేశారు. భవనాలు పూర్తి చేసి అప్పగించాలని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 1.32 కోట్ల పనిదినాలు లక్ష్యంగా ఉందని, ఏప్రిల్లో 18 లక్షల పని దినాలు వచ్చాయని, మేలో 34 లక్షల పని దినాలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. మే, జూన్ నెలల్లో ఎక్కువ పనిదినాలు పూర్తి చేయాలని, అప్పుడే లక్ష్యాలు చేరుకోగలమని అన్నారు. గ్రామాల్లో ఎటువంటి పనులకు డిమాండ్ ఉందో గుర్తించి, సంబంధిత పనులు సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పార్వతీపురం లక్ష్యాల్లో వెనుకబడి ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఉపాధి హామీ చట్టం, ఉపాధి కల్పనకు మంచి అవకాశమని అందులో నిర్లక్ష్యం ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో పక్కాగా విశ్లేషణ చేయాలని సూచించారు. సరాసరి వేతనం అందాలని, క్షేత్ర స్థాయి కొలతలు ఇవ్వాలని ఆదేశించారు. మొక్కల నాటే కార్యక్రమానికి అవసరమైన చర్యలు ఇప్పుడే చేపట్టాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పట్టుచెన్నూరులో గడప గడపకు...

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని పట్టుచెన్నురు పంచాయతీలో గల శిఖపరువు, వెలగవలస, గుంజి మడ, నిమ్మలపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మన రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో గత ప్రభుత్వాల సమయంలో ఏ పథకాలు వచ్చినా దళారీల జేబుల్లోకి వెళ్లేవని కానీ జగన్ మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చినప్పటి నుంచి ప్రతి పథకం తాలూకు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, ఎంపిపి రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఎంసి చైర్పర్సన్ దండి అనంతకుమారి, స్థానిక సర్పంచ్ సీదరపు సామి, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాసరావు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని బందలుప్పిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలని ఉద్దేశంతో అవినీతికి తావు లేకుండా ప్రత్యక్షంగా లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాళ్ల ప్రమీల, ప్రతాప్, జెడ్పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, మజ్జి చంద్రశేఖర్, వాసుదేవరావు, మడక విశ్వనాథం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామస్తులకు కరపత్రాలను అందజేస్తున్న రాజన్నదొర

అంబేద్కర్ సామాజిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సామాజిక భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు హామీ ఇచ్చారని ఎపి ఎస్, ఎస్టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి మాట్లాడమన్నారు. ఇటీవల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా కలిసినప్పుడు ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో అంబేద్కర్ సామాజిక భవనం మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారని, ఈ భవన నిర్మాణానికి కొరకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సామాజిక భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు ప్రత్యేకంగా మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. తమ సంఘం ప్రాతినిధ్యంపై చక్కగా స్పందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సామల పేర్కొన్నారు.

4న నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ జంక్షన్ వద్ద గల సాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 4న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం మంగళవారం ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వారిచే శ్రీకాకుళం జిల్లా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్న రోగులు తమ వెంట ఆధార్, రేషన్ కార్డు వంటివి తీసుకురావాలని, ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైస్సార్ చేయూత పథకంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎ.ఈశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన మండలంలోని మండ, పి.ఆమిటి గ్రామాల్లో పర్యటించి గిరిజన రైతులతో మాట్లాడారు. ఏజెన్సీలో పశువైద్యం ఎలా అందుతుంది, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా అని ఆరా తీశారు. అలాగే చేయూత నగదు అందుతుందా, లేదా, ఆ నగదుతో పశువులు కొనుగోలు చేశారా లేదా అని వైస్సార్ చేయూత లబ్ధిదారుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైఎస్ఆర్ పశు సంచార ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు అత్యవసరమైనచో 1962 టోల్ ఫ్రీ నెంబర్కు కాల్ చేసి తెలపాలని వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి పి.లక్ష్మణరావు, వెటర్నరీ అసిస్టెంట్ కె.మణికంఠేశ్వరి, వినయ్ పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలతో సమావేశం

పాలకొండ రూరల్: స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఇన్ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో పర్యటనలో భాగంగా నియోజక వర్గంలో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సభకు కావాల్సిన పలు స్థలాలను పరిశీలించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని జమదాలలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం బందలుప్పి పిహెచ్సి వైద్యాధికారి పి.శ్రీకాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60ఏళ్లు, ఆపైబడి వారికి కంటిచూపు తగ్గడం, అలాగే బిపి, సుగర్, దీర్ఘకాలిక వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని వైద్యులకు పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సుగర్, బిపి వారికి వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అంగన్వాడీ పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి వారికి కావాల్సిన మందులు ఇస్తూ జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ప్రజలంతా ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదంకలాం, సీతానగరం పిహెచ్సిల్లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ఏ విధంగా నిర్వహిస్తున్నారు, ఎటువంటి చర్యలు చేపడుతున్నారనే అంశాలపై ఆరా తీసి గ్రామాల వారీగా సంబంధిత సిబ్బంది రోజువారీ విధినిర్వహణల దినచర్య రికార్డులను (టూర్ డైరీ) పరిశీలించారు. ఆశా కార్యకర్తలిచ్చిన హెచ్బిఎన్సి కిట్లను ఉపయోగించి నవజాత శిశువులను ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని, శ్వాసకోస వ్యాధులను గుర్తిస్తే ప్రాథమిక వైద్యం అందించి తీవ్రతను బట్టి దగ్గర్లో ఉన్న ఎస్ఎన్సియుకు రిఫర్ చేయాలని సూచించారు. అలాగే గర్భిణులకు పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు నిర్వహించి సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆశాలకు ఇచ్చే మొబైల్స్ను వినియోగించి, ఇ-ఆశా యాప్ లో వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. ముందురోజు ప్రణాళిక వేసుకొని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పక్కాగా గ్రామాల్లో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించి జ్వరాలు, తదితర సీజనల్ వ్యాధులను గుర్తించి వైద్యం అందజేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డిఐఒ సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.శిరీష, సూపర్వైజర్లు సూర్యనారాయణ, ఈశ్వరమ్మ, జయాగౌడ్, సత్యవతి, భవాని, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : ఆశాలకు అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

భామిని : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డేను వైద్యాధికారి డాక్టర్ ఫణి కుమార్ నిర్వహించారు. ఈ నెల 5 వరకు మిడ్ వైఫేరీ వీక్ పాటించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సాధారణ కాన్పు వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ భాస్కరరావు, హెచ్వి గౌరీశ్వరి, ఎఎన్ఎం, ఎంఎల్హెచ్ఒ, ఆశా, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డిఒ హేమలత

రీసర్వే పనులను పరిశీలించిన ఆర్డిఒ

ప్రజాశక్తి సీతానగరం/ గరుగుబిల్లి

సీతానగరం, గరుగుబిల్లి మండలాల్లో భూ రీసర్వే మొదటి విడతలో సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వేరాళ్ల ఏర్పాటును మంగళవారం ఆర్డిఒ కె.హేమలత పరిశీలించారు. గరుగుబిల్లి మండలంలోని సీతారాంపురం (సివ్వాం దరి) లో జరుగుతున్న సర్వే రాళ్ల ఏర్పాటును పర్యవేక్షించామన్నారు. రైతులంతా సర్వే రాళ్ల ఏర్పాటుకు ఫీల్డ్ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు. మండలంలోని చిన్నారాయుడుపేట, పాపమ్మవలస, నీలకంఠపురం గ్రామాలను సందర్శించారు. ఫీల్డ్ సిబ్బందికి ఉన్న సమస్యలపై ఆరాతీసి ఏవైనా ఇబ్బందులుంటే వెంటనే తెలియజేయమని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. రోవర్ల పనితీరును పరిశీలించారు. రీ సర్వే పనులు, సర్వేరాళ్ల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దారు, సర్వే సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాలు తూచ తప్పకుండా పాటించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్వి రమణ, రీ సర్వే డిటి పప్పల చిట్టెమ్మ, మండల సర్వేయరు, ఆర్ఐ కరుణాకర్, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

దగ్గరుండి రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న సిఐటియు, డివైఎఫ్ నాయకులు

ఫలించిన పోరాటం

రోడ్లు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రీన్ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకలతో మండల కేంద్రమైన పాచిపెంటలో పాడైన రహదారులకు సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు పూర్తిగా గతుకుల మయమైందని సిఐటియు ఆధ్వర్యాన స్థానికులు చేసిన పోరాటానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ యువత పోరాటానికి స్పందించిన గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలు ఇబ్బందులు గురికాకుండా వాహనాలను నడిపే సందర్భంగా దుమ్ము, దూళి పడి అనారోగ్యం గురికాకుండా వాటరింగ్ చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పాడైపోయినట్టు గుమ్ములను పరిశుభ్రంగా బాగు చేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చేయాలని కోరారు ప్రజల సమస్యల పైన పోరాడిన యువతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు దేగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత పండగ మహోత్సవ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 6,7 తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ, యూత్ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.12వేలు, నాలుగో బహుమతి రూ.8వేలు చొప్పున ప్రదానం చేస్తామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం, ఎంపైర్ నిర్ణయం తుది నిర్ణయం, ప్రతి ఒక్క టీము డ్రెస్ కోడ్ పాటించాలని, నాకౌట్, లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. డే అండ్ నైట్ మ్యాచులు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో టిటిడి వారు కొత్తగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి విగ్రహప్రతిష్ట, మహాసంప్రోక్షణ కార్యక్రమం బుధవారం జరగనుంది. ఆలయ విగ్రహ ప్రతిష్టోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఆగమోక్తంగా క్షీరాధివాసం నిర్వహించారు. ఈనెల 4న మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుండి భక్తులకు స్వామి వారి దర్శనం ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవానికి పరిసర ప్రాంతాల నుండి విచ్చేసే భక్తుల కోసం టిటిడి ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో కంకణభట్టార్ శేషాచార్యులు, డిప్యూటీ ఇఒలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, ఇఇ సుధాకర్, ఎఇఒ రమేష్, డెప్యూటీ ఇఇలు ఆనందరావు, నాగరాజు, జెఇ రవికుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజన, కోలాట కార్యక్రమాలు

ఆలయం వద్ద గల వేదికపై టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గిరిజన ప్రాంతాల నుంచి భజన బందాలు కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. ప్రచార రథం ద్వారా సీతంపేట పరిసర గ్రామాల్లో ఆలయ మహాసంప్రోక్షణ గురించి భక్తులకు తెలియజేసేలా విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బలద నుంచి రామలింగేశ్వర భజన బృందం, పాలకొండ నుంచి సంపత్ వినాయక బృందం, సింగన్నవలస నుంచి శ్రీ సీతారామ భజన బృందం, తుమరాడ నుంచి వేంకటేశ్వర బృందం నామసంకీర్తన, చెక్కభజన చేశారు. అలాగే బొబ్బిలి నుంచి సీతారామ భజన బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

నేరాలు ఘోరాలు

బైకు, ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

పార్వతీపురం రూరల్ : ఆటో మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురుకు గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం జానుమల్లు వలసకు చెందిన యాళ్ల సింహాచలం నాయుడు గరుగుబిల్లి మండలం దళాయివలస వెళ్లి తిరిగి గుంట్రెడ్డి అప్పలనాయుడు, గుంట్రెడ్డి కృష్ణతో కలిసి మోటార్ సైకిల్పై వస్తుండగా దళాయివలస సమీపాన ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : మాత్రలు మింగి గృహిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డికెపట్నంకి చెందిన దుమ్మరి నరసమ్మ, నాగరాజు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. రెండు రోజుల నుండి నరసమ్మపై అనుమానంతో నాగరాజు సూటిపోటు మాట్లాడేవాడు. దీంతో మనస్తాపం చెందిన నరసమ్మ ఇంట్లో ఉన్న పారాసెటిమాల్ మాత్రలను వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు ఆమె కన్నవారికి తెలపగా వారుజిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

ఆటో బోల్తా పడిన ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలసకు చెందిన దాసరి పరమేసునాయుడు మంగళవారం గరుగుబిల్లి మండలం దళాయివలస ఆటోలో వెళ్తుండగా ఆ గ్రామ సమీపాన ఆటోడ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడినది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న వారు కింద పడిపోవడంతో అందరికీ గాయాలయ్యాయి. పరమేసు నాయుడుతో పాటు ఆటో ఉన్న మరో ప్రయాణికుడు గౌరినాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.